

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



మామిడిపల్లిలో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

దండేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని మండలంలోని పాత, కొత్త మామిడిపల్లి గ్రామాల్లో చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి. నాయకులు ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. దేశంలో నియంతృత్వ అప్రజా స్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, ప్రోగామ్ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జి భానేష్, ఆర్‌టీఏ మెంబర్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణపై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని మానుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ,సీనియర్ నాయకుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం వక్ఫ్ బోర్డును ప్రక్షాళన చేయాలనే ఉద్దేశ్యంతో వక్ఫ్ ఆస్తులు పేద ముస్లింలకు దక్కాలని వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువస్తే దానిపై కాంగ్రెస్, ఎంఐఎం, ఇతర ప్రతిపక్ష పార్టీలు స్వలాభం కోసం బి ల్లు పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఇది సరైంది కాదన్నారు. ఇన్ని రోజులు వక్ఫ్ ఆస్తుల పేరుతో కొన్ని సంపన్న ముస్లిం పెద్దలు అవినీతికి పాల్పడి ఆస్తులను దోచుకున్నాయన్నారు. ముస్లింలు ఎవరు కూడా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట కృష్ణ, ఏమాజీ, గాజుల ముకేష్‌గౌడ్, ఎనగందుల కృష్ణమూర్తి, అమిరిశెట్టి రాజు, వెంకటేశ్వర్‌రావు, రజి, రమేష్, రాకేష్ రెన్వా, చిరంజీవి పాల్గొన్నారు.

నస్పూర్‌లో ఏసీబీ కార్యాలయం

- ఈ నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు...

నస్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అవినీతి నిరోధక శాఖ కార్యాలయం నస్పూర్ పట్టణం సీసీసీ టౌన్‌షిప్‌లోని పాత పోలీస్ స్టేషన్ క్వాటర్‌లోకి తరలించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల చివరికల్లా ఆదిలాబాద్ నుంచి ఇక్కడకు డీఎస్పీ కార్యాలయం తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పాత పోలీస్ స్టేషన్ రెండు క్వాటర్లుండగా ఒక దానిలో బరోసా కేంద్రం పని చేస్తుంది. మరో క్వాటర్‌లో ఏసీబీ డీ ఎస్పీ కార్యాలయం ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన మరమ్మ తులు, సున్నాలు, కలర్స్ అన్ని వసతులు పూర్తయ్యాయి. జిల్లా వాసులకు తొందరగానే ఏసీబీ కార్యాలయం అందుబాటులోకి రానుంది. ఆదిలాబాద్ వెళ్లడానికి దూరభారం కావడంతో పిర్యాదు చేయడానికి చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాలలో ఏసీబీ కార్యాలయం ఏర్పాటు కానుండడంతో జిల్లాలో కొందరు అవినీతికి పాల్పడుతున్న అధికారులకు గుబులు మొదలైంది. కార్యాలయం ఏర్పాటుకు అన్ని ప్రయత్నాలు పూర్తయ్యాయని డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. బహూశా ఈ నెలలో కార్యాలయం ఏర్పాటయ్యే అవకాశం ఉండవచ్చన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

నస్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీతారాంపల్లి రైతు వేదిక వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్ హాజరుకానున్నారు. రైతులు, ప్రజలు సదస్సులో పాల్గొన్నాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సింగరేణి రిటైర్డు కార్మికులు

చెన్నూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని సోమనపల్లి గ్రామంలో సింగరేణి రిటైర్డు కార్మికులు ఆదివారం సీఎంరేవంత్‌రెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంపీ వంశీకృష్ణ సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు రూ. 140 కోట్ల ప్రావిడెంట్ ఫండ్ విడుదల చేయించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఘనంగా విష్ణుమూర్తి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

లక్సెట్టిపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండలం చెల్లంపేట గ్రామంలోని విష్ణుమూర్తి దేవాలయంలో ఆదివారం శ్రీలక్ష్మి సమేత విష్ణుమూర్తి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పురోహితులు శ్రీలక్ష్మి సమేత విష్ణుమూర్తి కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు వివాహ వేడుకలకు హాజరైన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

అటకెక్కిన 'ఫసల్ బీమా'..!



- తెలంగాణలో అమలుగాని పీఎంఎఫ్‌బీవై
- బీఆర్ఎస్ హయాంలో పథకంపై నిర్లక్ష్యం
- అదేదారిలో కాంగ్రెస్
- ప్రకృతి వైపరీత్యాలకు నిండా మునుగుతున్న రైతులు

మంచిర్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆరు గాలం కష్టించి రైతులు పండించిన పంటలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం రాష్ట్రంలో అటకెక్కింది. పీఎంఎఫ్‌బీవైతోపాటు పునర్ వ్యవస్థీకరించిన వాతావరణ ఆధా రిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) 2018-19 సాగు కాలానికి సంబంధించి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు కేంద్రం లక్ష్యం విధించినప్పటికీ అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో పథకం అమలు కు నోచుకోలేదు. పంట బీమా పథకంలో చేరేందుకు రైతులందరూ అర్హులుకాగా, పంట రుణం పొందే రైతులు పథకంలో తప్పనిసరిగా చేరాలనే నిబంధన ఉండేది. రుణం పొందని రైతులు బ్యాంకుల ద్వారాగానీ, అనుమతి పొందిన మధ్యవర్తి సంస్థల ద్వారా, కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా పథకంలో చేరే వెసులుబాటు కల్పించినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు చేరేందుకు మొగ్గు చూపలేదు.

బీమాతో రైతుకు ధీమా....

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలకు రైతులు బీమా చేయించడం వల్ల ఎలాంటి దిగులు లేకుండా ధీమాగా ఉండవచ్చుననే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభు త్వం పథకానికి శ్రీకారం చుట్టింది. పీఎంఎఫ్‌బీవై పథకం కింద విత్తనం విత్తినప్పటి నుంచి పంట కోతకు వచ్చే వరకు బీమా అమలుకానుండగా, దిగుబడి నష్టంపై ఆధారపడి బీమా వర్తిస్తుంది. అలాగే ఊ హించని ఉపద్రవం సంభవించి ప్రధాన పంటలకు నాట్లు వేయలేకపోవడం, స్థానిక విపత్తులు అయిన పంట నీట మునుగుటు, వడగండ్ల వాన, మట్టి పెళ్ల లు విరిగి పడటం, పంట మధ్యకాలంలో, పంట కోత ల తర్వాత 14 రోజుల వరకు తుపాను ప్రభావంతో పంటలకు కలిగే నష్టాలకు బీమా వర్తిస్తుంది. బీమా పథకంలో చేరడం వల్ల ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందు తుంది. ఇదిలా ఉండగా, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద అధిక లేదా అల్ప వర్షపాతం, రోజువారి ఉష్ణోగ్రత వ్యత్యాసాలు, చీడపీడలు (అధిక శాతం గాలిలో తేమ, గరిష్ట ఉష్ణోగ్రతలు), ఈదురు గాలుల కారణంగా పంట నష్టపోవడం వంటి వైపరీత్యాలకు బీమా వర్తిస్తుంది.

అవగాహన లేమితో....

పంట బీమా చేయించేందుకు అవగాహన లేమితో రైతుల నుంచి పెద్దగా స్పందన లేదనే చెప్పాలి. చివ రిసారిగా తెలంగాణ 2018-19 పంట కాలానికి సం బంధించి బీమా పథకం అమలు చేశారు. ఆ సమయంలో జిల్లాలో 2600 హెక్టార్ల వరి పంటకు 2800మంది రైతులుబీమా తీసుకోగా మొక్కజొన్నకు సంబంధించి కేవలం 10 మంది రైతులు మాత్రమే బీమా తీసుకున్నారు. పంట బీమాకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. అలాగే ఆనాడు భూ ముల క్రమబద్ధీకరణకు సంబంధించి ధరణి పోర్టల్ బ్యాంకర్లకు అందుబాటులో లేకపోవడం కూడా బీ మా తీసుకోకపోవడానికి కారణమని తెలుస్తోంది. అ యినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం సైతం పథకం లో చేరేలా రైతులను ప్రోత్సహించ లేదని అభిప్రా యాలు ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలయ్యేనా....?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొత్తలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు పంట నష్టపోకుండా ఉండేందుకు ఫసల్ బీమా అమలు చేస్తామని తెలిపింది. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఫసల్ బీమా పథకం ప్రస్తావన తేవడం లేదు. కాంగ్రెస్...

మిగతా 7లో

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



మందమర్రిలో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా బీ1 క్యాంపు కార్యాలయం పని చేస్తుందని, ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి వారి సమస్యలను విన్నవించవచ్చని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీ1 ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నేరుగా తనకు ఫోన్‌చేసినా సమస్యలను పరిష్కరిస్తున్నానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజల సమస్యలను విని వాటి పరిష్కారం కోసం తన దృష్టికి తీసుకు రావాలన్నారు. నిరుద్యోగుల ఉపాధికోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధి పొందేందుకు ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వవద్దని, తనకు తెలియజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మం దమర్రి, క్యాతనపల్లి మున్సిపల్ కమీ షనర్‌లు రాజలింగు, రాజు, కాంగ్రెస్ నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, రమేష్, రజనీ, శ్రీనివాస్, సంతోష్, లక్ష్మణ్, ఇసాక్, జావేద్ పాల్గొన్నారు.

●పట్టణంలోని బీ1 ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిదర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌లు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు

మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించి ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్నారని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మూడవ వార్డు వెంకటేశ్వర టెంపుల్ ఏరియా, 15వ వార్డు మార్కెట్ సెంటర్‌లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించి నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజలింగు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మహిళా సంఘాల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో మక్కలను తూకం వేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

దండేపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలు ఆర్థిక సాధికారతే సాధించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంచిర్యాల శాసన సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. దండేపల్లిలో ఆదివారం జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, డీఆర్డీవో కిషన్, మహిళా సంఘాలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆహర్నిషలు కృషి చేస్తోందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను అమ్ముకుని క్వింటా ళ్లకు రూ. 2225 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సింగతి మురళీ, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చందు, వైస్‌చైర్మన్ ఆరీఫ్, డీపీఎం వేణు, రమేష్, ఆర్‌జీపీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుపతి పాల్గొన్నారు.

హాజీపూర్‌లో..

లక్సెట్టి పేట(హాజీపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని పథకాల్లో మొదటిస్థానం ఇస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో హాజీపూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పుడు హాజీపూర్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా మహిళలకు అప్పగించా మన్నారు. ఈ కార్యక్రమంలో సంభందిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ సంగాలన సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వేసవి దుక్కులే కీలకం..

7

- జాగ్రత్తలతోనే పంటలకు అధిక దిగుబడులు..
- భూసార పరీక్షలతో మేలు



గ్రామాల్లో రైతులకు వివరిస్తున్న విస్తరణాధికారి ముత్యం తిరుపతి(ఫైల్)

ఘనంగా ఈస్టర్ డే



సీఎస్ఐ చర్చిలో క్రీస్తు పునరుత్థాన వేడుకలకు హాజరైన క్రైస్తవులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు పేమానురా గాలతో మెలగాలని సీఎస్ఐ చర్చి రెవరెండ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని సీఎస్ఐ చర్చీలో క్రీస్తు పునరుత్థాన పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువపైన తన రక్తాన్ని కార్చి మరణించి మూడవ దినమున లేచిన చరిత్ర సంఘటన ప్రపంచంలోని ప్రతి ఒక్కరికి కలవరపరిచిందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాల పాస్టర్‌రేట్ బేరర్స్ కార్యదర్శి పద్మారావు, మహిళచైర్మన్ ప్రియదర్శిని, కోశాధికారి వెంకటరాజం, స్టువర్ట్, బెంజిమెన్, జయప్రద, క్రైస్తవులు పాల్గొన్నారు.

గర్మిళ్ల: పట్టణంలోని క్యాథలిక్ చర్చీలో యేసు పునరుత్థాన పండగ అయిన ఈస్టర్ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొత్త నీరు, అగ్నిని ఆశీర్వదించారు. అనంతరం వెలిగించిన కొవ్వొత్తులతో చర్చి ప్రాంగణంలో ప్రదక్షణలు చేశారు. చర్చీలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్‌లు యోహాను, జోస్, ఏబిన్, క్రైస్తవులు పాల్గొన్నారు

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాలో ఆదివారం ఈస్టర్ డే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలోని చర్చిలలో ఈస్టర్ డే వేడుకలతో పాటు ప్రత్యేక పార్థనలు చేశారు. శుభ శుక్రవారం రోజున శిలువ పై మరణించిన యేసుక్రీస్తు ఆదివారం రోజున పునరుతారమయ్యారని చర్చి పాస్టర్‌లు వివరించారు. అనంతరం ఆయా చర్చిలో యే సుక్రీస్తు శిలువ వద్ద కొవ్వొత్తులు వే లిగించి శిలువ చుట్టు తిరుగుతూ ప్రత్యేక పార్థనలు చేశారు.

భీమారం: మండల కేంద్రంలోని చర్చీల్లో క్రైస్తవ భక్తులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాత్రి 12గంటల నుంచి ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు ఫాదర్ జోబీ, పాస్టర్ రాజేశ్, తిమోతి, సత్యరాజ్, బైబిల్‌పా ఠాలను వివరించారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని సీఎస్ఐ చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకను క్రైస్త వులు వైభవంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చ్ కమిటీ సభ్యులు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను అందుబాటులో ఉంచారు.

మందమర్రి టౌన్ : పట్టణంలోని సీఎస్ ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ డే వేడుకలను క్రైస్తవ కుటుంబాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో పాస్టర్ మాట్లాడుతూ యేసుక్రీస్తు జీవితం గురించి సభ్యులకు వివరించారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు జెర్మియా, సంఘస్థులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో పనిచేయని టిమ్స్

- ఇబ్బంది పడ్డ ప్రయాణికులు
- మూడు గంటలు డిపోకే పరిమితమైన బస్సులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఆర్టీసీ డిపోలో సాంకేతికలోపం కారణంగా ఆదివారం ఉదయం 3గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు టిమ్ మిషన్లు పని చేయకపోవడంతో బస్సులు డిపోకే పరిమితం అయ్యాయి. దీంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ అధికారులు హైద్రాబాద్‌కు సమాచారం చేరవేయడంతో మిషన్ లలోని సాంకేతిక ఇబ్బందులను తొలగించారు. మిషన్‌లు పనిచేయకపోవడంతో కొందరు ప్రయాణం వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, రాజధాని, ఇంద్ర, గరుడ తదితర బస్సులద్వారా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, హైద్రాబాద్‌లకు ప్రయాణించే వారు టిమ్‌మిషన్‌లు పని చేయకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. చేసేదేం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్ర యించాల్సి వచ్చింది.

ఇద్దరు ఉద్యోగుల మధ్య వాగ్వాదంతో జాప్యం

ఉదయం 3 గంటలకు సాంకేతిక సమస్య ఏర్పడడంతో బస్ డిపోకు చేరుకున్న సాంకేతిక నిపుణున్ని సెక్యూరిటీ సిబ్బంది డ్రంకెన్‌డ్రైవ్ మిషన్ ఊదాలని కోరడంతో సెక్యూరిటీ, సాంకేతిక నిపుణుల మధ్యవాగ్వాదం జరిగింది. ఇది కాస్తా ప్రయాణికుల పాలిట ఇబ్బందిగా మారింది. సెక్యూరిటీ సిబ్బంది లోనికి అనుమతి లేదని చెప్పడంతో తాను ఇక్కడి ఉద్యోగస్తుడినేనని, మాలధారణ వేసి ఉ న్న తన ను డ్రంకెన్ డ్రైవ్ మిషన్ ఊదాలని చెప్పడం సరైంది కాదని చెప్పాడు. కొంత సేపటి తర్వాత సాంకేతిక నిపుణుడు వచ్చిచూసి హైద్రాబాద్‌లోని ఉన్నతాధికా రులకు సమాచారం అందించారు. ఈ వాగ్వాదం కూడా బస్సుల ఆలస్యానికి ఒక కారణంగా పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సాంకేతిక ఇబ్బందులు తొలగించాం

- జనార్ధన్, డీఎం, ఆర్టీసీ డిపో మంచిర్యాల

టికెట్ ఇచ్చే మిషన్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో బస్సులు కొంత సేపు నిలిచిపోయాయి. కొంతమంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం హైద్రాబాద్‌లోని ఉన్నతాధికారులకు వివరించాం. సాంకేతిక నిపుణులు మిషన్‌లలోని సాంకేతిక ఇబ్బందులు తొలగించారు. ఉదయం 9 గంటల నుంచి బస్సులు యధావిధిగా నడిచాయి.

ప్రయాణికుల భద్రతకు పకడ్బందీ చర్యలు

ఎస్ సురేష్‌బాబు, జీఆర్పీఎఫ్ సీఐ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : రైల్వే ప్రయాణికుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : రైల్వే ప్రయాణికుల భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి వేళల్లో రిజర్వేషన్ బోగీలను కూడా తనిఖీ చేస్తున్నాం. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా పరిష్కరిస్తున్నాం. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేలా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుండా తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సీఐ : రైళ్లలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. రైళ్లో ప్రయాణించే సమయంలో పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ పోయిలను తీసుకెళ్ల కూడదని సూచిస్తున్నాం. తరుచుగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వేసవి ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ముందస్తుగానే ఈ చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : రైళ్లలో చోరీలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : రైళ్లలో చోరీలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా రైలు వచ్చిన సమయంలో సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం

- కాగజ్‌నగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

వరి కోతలు ముమ్మరం

- జిల్లాలో 20,143 ఎకరాల్లో వరి
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారుల చర్యలు

దహెగాం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగిలో సాగుచేసిన వరి పంటచేతికి రావడంతో కోతలు ముమ్మ రంగా సాగుతున్నాయి. రైతులు హార్వేస్టర్లతో వరికోతలు చేపడుతున్నారు. ఒక వైపు అకాల వర్షాల గుబులు పుట్టిస్తున్నా వరి కోతపనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా రైతులు సాగు చేసిన సాధారణ, సన్నరకం వరి పంట కోతలు కూలీలు, రైతులు నిమగ్నమయ్యారు. సుమారు నెల రోజుల పాటు కోతలు సాగే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

● 15 మండలాల పరిధిలో..

జిల్లా వ్యాప్తంగా పదిహేను మండలాల్లో రైతులు ప్రాజెక్టులు, కుంటలు, చెరువులు, వ్యవసాయ పంపుసెట్లు, నీటి వనరులు లభించే ప్రాంతాల్లో వరి పంటను సాగుచేశారు. సన్నం, దొడ్డుర కం విత్తన వరిని రైతులు సాగు చేశారు. జిల్లాలోని అత్యధికంగా దహెగాం మండలంలో 7,956ఎకరాల్లో పంటను రైతులు సాగు చేశారు. జిల్లాలో 20,143 ఎకరాల్లో వరిపంట సాగుచేసినట్లు అధికారులు చెబుతు న్నారు. 5,23,721 క్వింటాళ్లధాన్యం దిగు బడివస్తుందని వ్యవసాయ శాఖాధి కారులు అంచనా వేశారు.



దహెగాంలో వరి కోత చేపడుతున్న రైతులు



పంట పొలాల్లో ఆరబోసిన ధాన్యం

● జిల్లాలో 34 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా 34ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఐకేపీద్వారా13, ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం ద్వారా 21 కొను గోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు చేపట్టనున్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యం ధర 2,320, సాధారణరకం 2,300 రూపాయలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తూ క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించనుంది. దీంతో రైతులకు కొంత మేరకు ఊరట లభిస్తుంది.

నెలాఖరులోగా ప్రారంభిస్తాం..

ఏప్రిల్ నెలాఖరుల్లోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. జిల్లాలో 34 కేంద్రాల ద్వారా 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిం చడం లక్ష్యంగా పెట్టుకున్నాం. సన్నరకం ధాన్యా నికి క్వింటాలుకు 500రూపాయల బోనస్ ప్రభు త్వం అందజేస్తోంది.

- ఆర్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

సింగరేణికి మాజీ ఎంపీ చేయూతనిచ్చారు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ బీఐఎఫ్ ఆర్‌లోకి వెళ్లినప్పుడు అప్పటి కేంద్ర ప్రభుత్వంతో దివంగత మాజీ ఎంపీ వెంకటస్వామి మాట్లాడి 600 కోట్లకు పైగా ప్రత్యేక మారిటోరియం ఇప్పించి చేయూతనిచ్చారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం బీ1 క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కుటుంబాల పోషణార్థం పెన్షన్ కావాలని, పెన్షన్ స్కీం మంజూరు చేయించారని అన్నారు. నాలుగు నుంచి ఐదు దశాబ్దాల పాటు సంస్థలో పని చేసి విరమణ పొందిన ఉద్యోగులకు 500 నుంచి 1000 రూపాయల పెన్షన్ మాత్రమే పొందుతున్నారని తెలిపారు. ఇటీవల పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్ సమావేశాల్లో పదే పదే మాట్లాడారని చెప్పారు. 500 నుంచి 1000 రూపాయల పెన్షన్‌తో ఇబ్బందులు పడుతున్నారని, కనీసం వైద్య ఖర్చులకు లేక నానా అవస్థలు పడుతున్నారని ప్రస్తావించారని అన్నారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతీ టన్నుకు 20 రూపాయల కార్పస్ పన్నును కేటాయించిందని పేర్కొన్నారు. దీని ద్వారా రిటైర్డు పెన్షన్ నిధికి దాదాపు 140 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సొత్కు సుదర్శన్, బండి సదానందంయాదవ్, గుడ్ల రమేష్, నోముల ఉపేందర్ గౌడ్, గడ్డం రజిని, నెర్వెట్ల శ్రీనివాస్, మంద తిరుమల్, రాయబారపు కిరణ్, మద్దెల విజయ్, మహాంత్ అర్జున్ కుమార్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



మంతెనకుమార్(ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పొనూరు గ్రామానికి చెందిన మంతెనకుమార్ (39) అనే యువ రైతు పురు గుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీధర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కుమార్ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతనికున్న రెండెకరాల పొలంలో వరి పండిస్తున్నాడు. గత సంవత్సరం పంట ఎండుతుందని రెండు సార్లు బోర్లు వేయించినా నీరు పడలేదు. దీంతో పాటు మూడేళ్ల నుంచి వరి పంట చేతికి అందక, పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో సుమారు రూ. 4 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ప్రతి సంవత్సరం ఎండిన పంటను చూసి బాధపడుతుండేవాడు. ఓ వైపు పంట చేతికి అందకపోవడం మరోవైపు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి విష యాన్ని కుటుంబీకులకు తెలిపాడు. దీంతో వారు అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమార్‌కు భార్య , కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చైన్‌స్నాచింగ్ దొంగ అరెస్టు



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళ మెడలోని చైన్‌ను కిటికీ నుంచి అపహరించిన చైన్‌స్నాచింగ్ దొంగను 12గంటల వ్యవధిలోనే రామకృష్ణాపూర్ పోలీసులు చేదించి పట్టుకున్నారు. ఆదివారం రామకృష్ణాపూర్‌పోలీసు స్టేషన్ బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఇరుముల్ల శరణ్య కిటికీ పక్కన నిద్రిస్తున్న సమయంలో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు, అదే విధంగా బుర్ర రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌ను కిటికీలో నుంచి అపహరించి పారిపోయాడు. సంఘటన పై బాధితులు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకున్నారు. దీంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలను పరీక్షించగా నిందితుడు గుంజ ఇమన్యుల్‌గా తేలింది. వెంటనే గోదావరిఖని కాకతీయ కాలనీ పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సింగరేణి ఏరియా ఆసుపత్రి చౌరస్తా వద్ద బైక్‌మీద వెళ్తున్న నిందితుడిని తనిఖీ చేయగా జేబులో సుమారు మూడుతులాల పుస్తెలతాడు, ఒక మొబైల్‌ఫోన్ దొరకడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరస్తుడు గుంజ ఇమన్యుల్ గోదావరిఖని కాకతీయ కాలనీకి చెందినవాడు. గతంలో పలు చోరీ కేసుల్లో అరెస్ట్ అయి ఇటీవల విడుదలయ్యాడు. మళ్లీ దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడినట్టు ఏసీపీ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. మందమర్రిసీఐ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, క్రైం టీం సిబ్బందికి సీపీ అభినందించి వారికి రివార్డు అందజేశారు.

ఇంద్రవెల్లి అమరవీరులకు ఘన నివాళి

కాసిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి అమరవీరులకు ఆదివారం దేవాపూర్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య మాట్లాడుతూ జల్‌జంగల్ జమీన్‌పై ఆదివాసీలకు హక్కులు కల్పించాలని పోరాటం చేస్తూ సమావేశం నిర్వహించుకున్నారని చెప్పారు. ఆదివాసీ హక్కుల కోసం సమావేశం నిర్వహిస్తుండగా పోలీసులు కాల్పులు జరిపి 60 మందిని పొట్టనపెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ం కొడప అనంతరావు, పంది మల్లేశ్, ఆత్రం రాజు, సిడాం కిషన్, శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

డివైడర్ బ్లాక్‌లు నిరుపయోగం

ఖాళీ స్థలంలో పడేసిన వైనం

నస్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మున్సిపాలిటీలోని తోళ్ళవాగు నుంచి జీఎం కార్యాలయం వరకు జాతీయ రహదారి-63పై డీఎంఎఫ్‌టీ నిధులు దాదాపు రూ. కోటి రూపాయల వ్యయంతో నాలుగేళ్ల కిందట వేసి డివైడర్ బ్లాక్స్ తొలగించి ఖాళీ స్థలంలో పడేశారు. దీంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. మూడేళ్ల కింద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ బ్లాక్స్ రోడ్డు విస్తరణలో భాగంగా వాటిని తొలగించి సిమెంట్‌తో డివైడర్ నిర్మించి అందులో మొక్కలు, ఇనుప కంచె, సెంట్రల్ లైటింగ్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం హయంలో కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి కొనుగోలు చేసిన డివైడర్ బ్లాక్స్ నస్పూర్ విలేజీ వెళ్ళే మార్గంలో ఖాళి స్థలంలో పడేశారు. డివైడర్లను పెట్టడానికి, తిరిగి తీయడానికి చాలా ఖర్చు అయింది. కొనుగోలు చేసిన వాటిని నియోజక వర్గంలో ఇతర ప్రాంతాల్లో అవసరమైన చోటుకు తరలించి అక్కడ వీటిని పెడితే బాగుటుందని పలువురు అనుకుంటున్నారు. గతంలో జాతీయ రహదారిపై డివైడర్ స్థానంలో బ్లాక్స్‌ను పెట్టారు కానీ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తరచుగా డివైడర్లను ఢీకొని ప్రమాదాలకు గురైయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా డివైడర్లను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ గోడ, సెంట్రల్ లైటింగ్ పోల్స్, ఏర్పాటు చేశారు. డివైడర్ బ్లాక్‌ల స్థానంలో చిన్న గోడ లో డివైడర్ నిర్మాణం చేపట్టినందున అంతకు ముందు ఉన్న డివైడర్ బ్లాక్‌లను తొలగించారు. ప్రస్తుతం డివైడర్ బ్లాక్‌లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. అధికారులు డివైడర్ బ్లాక్‌లను మరో చోట రోడ్డు మధ్యలో మలుపుల వద్ద ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



నస్పూర్‌లో ఖాళీ స్థలంలో పడేసిన డివైడర్ బ్లాకులు

గాయపడిన కాంట్రాక్టు ఉద్యోగికి న్యాయం చేయాలి

నెన్నెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) విధి నిర్వహణలో కరెంటు స్తంభం పై నుంచి పడి తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టు ఉద్యోగి సొదరి చంద్రయ్యకు విద్యుత్ శాఖ వారు న్యాయం చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట చంద్రయ్య గంగారం గ్రామంలో తీగలు సవరిస్తుండగా స్తంభం విరగడంతో పై నుంచి కింద పడి తీవ్రగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన చంద్రయ్యను ఆయన స్వగ్రామం కొత్తూర్‌లో ఆదివారం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు కాళ్లు విరగడంతో చంద్రయ్య మంచం నుంచి కదల లేని పరిస్థితిలో ఉన్నాడన్నారు. మెరుగైన చికిత్స అందించడంతో పాటు పరిహారం అందించి, పూర్తిగా కోలుకునే వరకు అధికారులే బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చంద్రయ్య పరిస్థితిని వివరించారు. తమ సంఘ సభ్యుడైన చంద్రయ్యకు అండగా ఉంటామన్నారు. నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, ఉపాధ్యక్షులు కలాలి నర్సయ్య, కామెర ప్రకాష్, నాయకులు గోమాస రాజ్యం, కామెర శ్రీనివాస్, కుమ్మరి మల్లేష్, వనపర్తి యువరాజ్, రాంబాబు, ప్యాగ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



చంద్రయ్యను పరామర్శిస్తున్న నాయకులు

గుంతల రోడ్డు.. వాహనదారుల ఇబ్బందులు



గుంతలు పడిన కాగజ్‌నగర్-నారాపూర్ రోడ్డు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-నారాపూర్ వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాగజ్‌నగర్‌కు వివిధ అవసరాల నిమిత్తం ఆటోలు, బైక్‌లపై రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

బెజ్జూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని ఎలుకపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఆయన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ అస్పృశ్యత లేని సమాజం కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. భారత రాజ్యాంగం రాసిన మహనీయుడని చెప్పారు. బహుజనులు చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కోనప్ప అన్నారు. దళితుల కష్టసుఖాల్లో పాలుపం చుకుంటూ అందుబాటులో ఉంటానని చెప్పారు. మే 12న బుద్ధుడి మహోత్సవం సిర్పూర్‌లోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ధమ్మ గురువు శరన్‌తెరో, దళిత సంఘం నాయకులు జనార్దన్, గౌతం పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఆసిఫాబాద్ బస్టాండులో వసతులు కరువు

- పెరిగిన రద్దీ.. సరిపోని ప్లాట్‌ఫాంలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్టాండు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండులో వసతులు కరువయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత ప్రయాణికుల తాకిడి పెరిగింది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మహలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండడంతో బస్టాండులో రద్దీ పెరిగింది. కానీ ఆ మేరకు వసతులు మాత్రం కరువయ్యాయి. జిల్లాలో ఉన్న ఏకైక బస్ డిపో ఆసిఫాబాద్. జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండులో రద్దీకి తగినంత సదుపాయాలు లేవు. ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం మండలాలు, గ్రామాలనుంచి జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో రద్దీ రోజు రోజుకు పెరుగుతోంది. బస్‌స్టేషన్‌లో కేవలం ఐదు ప్లాట్ ఫాంలు మా త్రమే ఉండడంతో ప్రయాణికుల రద్దీ సమయాల్లో నీడ కల్పించలేని పరిస్థితి నెలకొంది. బస్టేషన్ విస్తరణ కోసం ఆర్టీసీ అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆసిఫాబాద్ డిపో నుంచి..

ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రతి రోజు అన్ని రూట్లలో 81 షెడ్యూళ్లు 89 బస్సులను ఆయా పట్టణాలు, గ్రామాలు, శివారు గ్రామాలకు బస్సు సర్వీసులు నడుపుతోంది. సగటున ప్రతి రోజు 33,700 కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ఇందులో 30 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ప్రతి రోజు డిపోకు రూ 18.8 లక్షల ఆదాయం సమకురుతోంది. గతంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఉన్నప్పుడు బెజ్జూరు, కౌటాల వంటి మారుమూల మండలాలకు చెందిన ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం ఆదిలాబాద్‌కు చేరేందుకు ఆసిఫాబాద్, మంచిర్యాల మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్లే వారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం కావడంతో ఆదిలాబాద్‌కు రద్దీ భారీగా పడిపోయినట్లు ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. అదే సమయంలో ఆసిఫాబాద్‌కు క్రమంగా రద్దీ పెరుగుతున్నందున డిపో ఆదాయం కూడా పెరిగింది. జిల్లాగా మారిన తరువాత అన్ని మండలాల నుంచి ప్రజలు ప్రభుత్వ పరమైన కార్యకలాపాల కోసం జిల్లా కేంద్రానికి ప్రజలు రాకపోకలు సాగిస్తు న్నారు. మరీ ముఖ్యంగా సోమ, శనివారాల్లో రద్దీ అధికంగా ఉంటున్నది. అధికారులు ఆదాయం వస్తున్నా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రసుత్తం ఎండల తీవ్రతకు రద్దీ అధికంగా ఉన్నప్పుడు నిలబడేందుకు కూడా చోటు లేకుండా పోయిందని ప్రయాణి కులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వసతులు పెరుగలేదు..



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పడి ఎనిమి దేళ్ల గడిచినా బస్టాండులో కనీస వసతులు మెరుగుపడలేదు. దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- చిరంజీవి, ఆసిఫాబాద్



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

వేద పాఠశాలను సందర్శించిన న్యాయాధికారి



పూజలు చేస్తున్న న్యాయాధికారి యువరాజా

తాండూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో గల శ్రీ మహాదేవ వేద పాఠశాలను ఆదివారం ఆసిఫాబాద్ సీనియర్ సివిల్ జడ్జి యువరాజా సందర్శించారు. పాఠశాలలో శివుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద స్వస్తితో విద్యార్థులు జడ్జిని ఆశీర్వదించారు. అనంతరం జడ్జిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర అవధాని, ముద్దు ధీర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం



భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

గర్మిళ్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చింతపండు వాడలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రాజు, రాకేష్, లావణ్య, అనుతేజ్, సాహిత్, రావణ్, రాజు, సంధ్యారాణి, నాగిరెడ్డి, ఆదిత్య, వేణు గోపాల్ పాల్గొన్నారు.

వేసవి దుక్కులే కీలకం

- జాగ్రత్తలతోనే పంటలకు అధిక దిగుబడులు..
- భూసార పరీక్షలతో మేలు.

నస్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో సస్యరక్షణ చర్యలుపాటిస్తే తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశాలు న్నాయి. మోతాదుకు మించిన పురుగు మందులు వినియోగిస్తే ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. వేసవి దుక్కుల ద్వారా కలిగేలాభాలు, అనేక ప్రయోజ నాలను వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు వివరిస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో గ్రామాల్లో వేసవి దుక్కులు రైతుల ముమ్మరంగా చేపట్టారు. జిల్లాలో దాదాపు రెండులక్షల యాభైవేలకు పైగా ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగు అవుతున్నాయి. గతసీజన్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించిన వాటిని తొలగించి వేసవి దుక్కులు చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు పర్యటిస్తూ వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పి స్తున్నారు. వేసవి దుక్కుల వలన కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్నారు. వేసవి దుక్కుల కారణంగా గుల్లబారిన నేలలు పంటలకు భూబౌతికస్థితి, స్వరూపాన్ని మెరుగుపర్చుతుంది. ట్రాక్టర్లతో దుక్కులను లోతుగా నాగళ్లతో దున్నించడం వలన వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుదినుసులు, కంది తదితర పంటలు సాగు చేసిన సమయంలో మొక్కల వేళ్లు భూమిలోకి సులభంగా చొచ్చుకుపోతాయి. దీంతో మొక్కలు బలంగా మారి పంటల దిగుబడికి దోహదం చేస్తాయని మందమర్రి వ్యవసాయ విస్తరణాధికారి ముత్యం తిరుపతి సూచిస్తున్నారు.



వేసవి దుక్కులు దున్నతున్న ట్రాక్టర్

● వర్షాలు కురియకముందే దున్నాలి..

వర్షపు నీరు ఎత్తు పల్లాలకు ప్రవహించే సమయంలో భూమి కోతకు గురవుతోంది. పంట పొలాల్లో అండంగా దున్నడం వలన నేల కోతకు గురి కాకుండా ఉంటుంది. దుక్కులు లోతుగా అడ్డంగా, వాలుగా దున్నితే వర్షపు నీరు భూమిలోకి ఇకి తేమను నిల్వచేసే సామర్థ్యం పెరుగుతుంది. తొలకరి వర్షాలకు నేల మొత్తబడి భూమిలోకి నీరు ఇంకడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెడితే కలుపు మొక్కలు నివారించే అవకాశం లభిస్తుంది. దీని మూలంగా భూసారం దెబ్బతిన్న కుండా భూసారాన్ని కాపాడుటలో కీలకంగా వేసవి దుక్కులు పని చేస్తాయి. ఇలాంటి చర్యల వలన పంటల దిగుబడి పెరగడంతో పాటు తెగుళ్ల బారి నుంచి తట్టుకుంటుంది.

● రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి..



తొలకరి వర్షాలకు ముందుగానే దున్న డం వలన జూన్, జూలై మాసాల్లో కురిసే వర్షపునీరు నేలలోకి ఇంకుతుంది. భూమిలోకి నీరు ఇంకడం వలన నేలలో తేమశాతం పెరుగుతుంది. ఫలితంగా సాగుచేసి పంటల విత్తనాలు సకాలంలో మొలకెత్తే అవకాశం ఉంటుంది. పంటల రక్షణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలి. సీజన్ ప్రారంభం కాగానే రైతులు పంట పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి. తొలకరి వర్షాలు కురిసే ముందు పశువుల, మేకల, కోళ్ల ఎరువులతో పాటు చెరువు మట్టి పొలాల్లో వేస్తారు. వేసవి దుక్కులను ఎరువులు కలియ దున్నితే భూమి పొరల్లోకి చేరుతోంది. ఆశించిన ఫలితాలతో పాటు పంటల దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

● భూసార పరీక్షలు కీలకం

వ్యవసాయరంగంలో పంటల సాగులో భూసారపరీక్షలు ఎంతో కీలకమైనవి. భూమిలోని పోషకాలు లోపాలు పరీక్షల ద్వారా గుర్తించి ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల వాడకం ముందస్తుగా చేపట్టాలి. అధికారుల సూచనల మేరకు మట్టి నమూనాలు సూచించిన పద్ధతిలో తీయాలి. గ్రామాల్లో రైతులకు భూసార పరీక్షల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షకేంద్రానికి పంపుతారు. పోషకలోపాలను సమర్థవంతంగా నివారించడం ద్వారా మంచి ఫలితాలు, ప్రయోజనం కలుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులు వారి వారీ పంట పొలాల్లో రెండేళ్ల కొక్కసారి భూసార పరీక్షలు చేయించాలి.



● చీడపీడల నివారణ...

వివిధ రకాల పంటల సాగులో కలుపు తీత ప్రధాన సమస్యగా తయారైయింది. ఇదివరకు వేసిన పంటలలో నివారించకుండా ఉన్న కలుపు మొక్కల విత్తనాలు భూపొరల్లో ఉండిపోయి తొలకరి వర్షాలకు మొలకెత్తుతాయి. వేసవిలో దుక్కులను లోతుగా దున్నితే అలాంటి మొక్కలను నివారించవచ్చు. ఆ తరువాత వేసే పంటల్లో కలుపు సమస్య తగ్గే అవకాశం ఉంటుంది. పంటలను ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు ఎంతో ముఖ్య మైనది. ఇదివరకు సాగు చేసిన పంటల కాలంలో చీడపురుగులు నిద్రావస్థలో ఉంటాయి. వేసవి దుక్కుల వలన భూపొరలను లోతుగా దున్నడం వలన బయటకు వచ్చి నశిస్తాయి. ఇదివరకు సాగు చేసిన పంటలకు చెందిన తెగుళ్ల అవశేషాలు సూర్యరశ్మితో చనిపోతాయి. వేసవి దుక్కుల వలన అనేక లాభాలు, ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

అటకెక్కిన ఫసల్‌బీమా

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటించిన విధంగా రా ష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమల్లోకి తెస్తే రైతులకు మేలు చేసినట్లవుతుంది. రైతులు పథకంలో చేరి తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటకు నష్టం జరిగిన పక్షంలో ఇన్సూరెన్స్ కంపెనీలే ఆ బాధ్యత వహించి, రైతుకు నష్టపరిహారం చెల్లిస్తాయి. తద్వారా పంట నష్టం జరిగినప్పుడల్లా ప్రభుత్వం అందిస్తున్న ఎకరాకు రూ. 10వేల పరిహార భారం కూడా ప్రభుత్వంపై పడదు. పథకాన్ని పున: ప్రవేశపెట్టి, రైతులకు సరైన రీతిలో అవగాహన కల్పిస్తే పంట బీమాకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అకాల వర్షంతో భారీ నష్టం...

మార్చి నెలలో కురిసిన అకాల వర్షం కారణంగా జిల్లాలో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మార్చి 21న కురిసిన వర్షంతో జిల్లా వ్యాప్తంగా 113 మంది రైతులకు చెందిన 255 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. కోతదశకు వచ్చిన పంట పూర్తిగా నీటిపాలు కాగా, మొక్కజొన్న పంటకు కూడా పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. అయితే రాష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమలు అయి వుంటే రైతులకు నష్టం జరిగేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. ఇప్పటి కైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా పంట బీమా పథకం ప్రవేశపెట్టాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

ప్రజా సమస్యలను విస్మరించిన ప్రభుత్వం..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

నస్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం అధిష్టానం చుట్టూ తిరుగుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు పదవుల కోసం ఆరాట పడుతున్నారే తప్ప జిల్లా అభివృద్ధికి పని చేయడం లేదన్నారు. ప్రభుత్వ పాలన తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల తగిన గుణపాఠం చెబుతారన్నారు. చెన్నూరులో మైనింగ్, ఇసుక మాఫీయా ఆగడాలు మితిమీరిపోయాయని, ఇంతా జరుగుతున్న అధికారుల్లో ఏ మాత్రం కదలిక లేకుండా పోయిందన్నారు. చెన్నూరు నియోజక వర్గంలో ఎమ్మెల్యే వివేక్ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ సభకు జిల్లా నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బాల్క సుమన్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ అద్యక్షుడు అక్కురి సుబ్బయ్య, నాయకులు నడిపెల్లి విజిత్ రావు, లక్ష్మన్, సంపత్, భూమేష్ పాల్గొన్నారు.

కన్నయ్య కుటుంబాన్ని ఆదుకోకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండలంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డ ఆదివాసీ యువకుడు కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోతే కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్మ పున్నం పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని, మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇల్లు, కన్నయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కన్నయ్య మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఈ నెల 21, 22 తేదీల్లో మండలాలు, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం స్పందించకంటే ఛలో కలెక్టరేట్ చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, ఐద్వాజిల్లా కార్యదర్శి ఉమారాణి, రాజేశ్వరి, మోహన్, రాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఎర్మ పున్నం

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కోటపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 27న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి సోమవారం నుంచి హాల్‌టికెట్‌లు మోడల్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10 వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

మందమర్రిరూరల్ : మోడల్ స్కూల్‌లో అడ్మిషన్‌లు పొందేందుకు ఈ నెల 27న ప్రవేశ ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్లీమా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్‌లను సోమవారం నుంచి మోడల్ స్కూల్ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

సంబంధిత విద్యార్థులు వారి తల్లిదండ్రులు గమనించాలన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో ముందుండాలి



కమిటీని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కాసిపేట, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయ ఆర్థిక సామాజిక వెనుకబాటుతనం వీడి అన్ని రంగాల్లో ముందుండాలని యాదవ సంఘం జిల్లా నాయకులు బోయిని తిరుపతి యాదవ్ అన్నారు. ఆదివారం కొండాపూర్‌యాప వద్ద ఏర్పాటు చేసిన యాదవ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులు ఐక్యమత్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం యాదవ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షులుగా ముత్యాల రాజ మౌళి, ఉపాధ్యక్షులుగా రేసవేని ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా మేరుగు శంకర్, కోశాధికారిగా ముత్యాల రాజన్న, ముఖ్య సలహాదారుడిగా దాడి గట్టయ్య, కార్యవర్గ సభ్యులుగా బొద్దుల మల్లేశ్, రంగ సంతోష్, కొమ్ము భూమయ్య, మేకల చంద్రయ్య, కసాడి భూమయ్యలను ప్రకటించారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈకమిటీ యాదవ సంఘం అభివృద్ధి సామాజిక సమస్యలపై పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జన్నారం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జన్నారంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 1982-83 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పుడు విద్య నేర్పిన గురువులు సుధాకర్‌రెడ్డి, జనార్ధన్, దక్షిణామూర్తిలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే భూభారతి

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంను ప్రవేశపెట్టిందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం చెన్నూరులోని మైనార్టీ ఫంక్షన్‌హాలులో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా హక్కులు, రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేస్తామన్నారు. అనంతరం పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం చెన్నూరులోని వంద పడకల ఆసుపత్రి పరిధిలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీని వాస్‌రావు, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మో హన్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

భూభారతి దేశానికే రోల్ మోడల్

జైపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చి భూభారతి పోర్టల్ దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని దీంతో భూ వివాదాలు తొలగి పూర్తిస్థాయిలో డిజిటల్ అవుతాయని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ధరణి పోర్టల్ పేరుతో భూ దందా సాగిందన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ తహసీల్దార్ వనజారెడ్డి, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.

భీమారం: రైతుల గోసలను శాశ్వతంగా తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వివేక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని పాత చెరువులో పూడిక తీత పనులకు, చెరువు మరమ్మతు పనులకు మండలంలోని నాయకులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏళ్లతరబడి తాము పండించే పంటలకు నీరు లేక పంటలు మధ్యలోనే ఎండిపోతున్నాయని ఈ సమస్యను గ్రామ నాయకులు తమ దృష్టికి తెలుపడంతో తీసుకరావడంతో చెరువు మరమ్మతు పనులకు 33 లక్షల రూపాయల నిధులతో పనులను ప్రారంభించామని తెలిపారు. భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి పథకాన్ని అమలుల్లోకి తెచ్చిందన్నారు. గతంలో 108 అంబులెన్స్ లేక మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానిక నాయకులు తెలుపడంతో అంబులెన్స్‌ను మండలానికి అందించి మండలం రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీవో మధుసూదన్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు, మండల ముఖ్య నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాల సంఘం బలోపేతానికి కృషి చేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): మాలసంఘం బలోపేతానికి కృషి చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మాలమహానాడు సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాలలందరూ సంఘం బలోపేతంతో పాటు ఐక్యతగా ముందుకు వెళ్లాలని సేవా మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎన్నుకున్నవారిలో బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడిగా సుభాష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా చక్రధర్, గౌరవాధ్యక్షులుగా సమ్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, మురళి, ఆసాడి మధు, గుండా మాణిక్యంతో పాటు పట్టణకమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కుంబాల రాజేశ్, ఉపాధ్యక్షులు మద్దెల గోపి, తదితరులు పాల్గొన్నారు.



మాలమహానాడు నూతన కమిటీ సభ్యులు

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై అవగాహన

కోటపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని సిర్సా గ్రామంలో ఆదివారం బీజేపీ మండల కన్వీనర్ పెద్దింటి పున్నంచంద్ ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, జాతీయ కార్యవర్గ సభ్యుడు పెద్దపల్లి పురుషోత్తం, మండల ఇన్‌చార్జి కాశెట్టి నాగేశ్వర్‌రావు వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్ల కొండ రాజేష్, గణేష్, సుంకె నగేష్, మల్లన్న, అశోక్, రామయ్య పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఇంద్రవెల్లి స్తూపం వద్ద ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మంత్రి సీతక్క

మంచిర్యాలక్రైం, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కొక్కిరాల రఘు పతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం అమరవీరుల కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేస్తామని అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి మంత్రి సీతక్కతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడి ఎన్నిక

మంచిర్యాలక్రైం, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా జెల్ల తిరుపతిని నియమించారు. ఈ సందర్భంగా తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి ఆశయాలకోసం, సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని జెల్ల తిరుపతి అన్నారు.

ప్రారంభమైన ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నిర్వహణాధికారి ఉదయ్ బాబు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు ఆసిఫాబాద్‌లో రెండు, కాగజ్‌నగర్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 237 మందికి గాను 208 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షకు 172 మందికిగా గాను 155 మది హాజరయ్యారు. 17 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

నిరుపేద మహిళకు చేయూత

బెజ్జూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బారెవాడలో నివసిస్తున్న లక్ష్మి తల్లి తారాబాయి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్సీ దండె విఠల్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో రాజన్న, శంకర్, సురేష్, శ్రీను, వైకుంఠం, తిరుపతి, క్రాంతి, వసంత్, శ్యాముల్, అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

జైనూర్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంలొద్ది పంచాయతీలో గల కొండాపటార్ గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్(60) అనే గిరిజనుడు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. లక్ష్మణ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో పాటు మద్యానికి బానిసై తిరుగు తున్నాడు. ఆదివారం గ్రామసమీంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

జైనూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన కెరమెరి మండలానికి చెందిన ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లపై ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై రవికుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడుపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.

అగ్గి ఆర్పేలోపే..

ఆస్తులు బుగ్గి

జిల్లాలో వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రజల్లో ప్రమాదాల నివారణపై సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ నష్టం వాటిల్లుతోంది.

- జిల్లాలో రెండు అగ్నిమాపక కేంద్రాలు
- కౌటాల, జైనూరులో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ
- ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది. అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నా ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. గత ఏడాది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా జరిగిన సంఘటనల్లో పలు చోట్ల ఆస్తి నష్టం అధికంగా ఉంది. మరికొన్ని చోట్ల అగ్నిమాపక సిబ్బంది. కోట్లాది విలువైన ఆస్తులను కాపాడారు ప్రాణ నష్టం లేకపోయినా ఆస్తి నష్టం పెరుగుతూ వస్తోంది. ప్రమాదాలకు వేసవి కాలంతో పాటు అనేక కారణాలు ఉన్నాయి. అగ్నిప్రమాదాల నివారణకు మరికొన్ని అగ్నిమాపక కేంద్రాలు అవసరం. 25 కిలోమీటర్లకు ఒక అగ్నిప్రమాద కేంద్రం ఉంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

నియోజకవర్గానికి ఒకటి..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కేవలం నియోజకవర్గానికి ఒకటి చొప్పున రెండు అగ్నిమాపక కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. దశాబ్దాలుగా కేవలం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లోని అగ్నిమాపక కేంద్రాల తోనే అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు జిల్లా లో 15 మండలాలు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలున్నాయి. కేవలం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌గనర్‌లో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో కౌటాల, బెజ్జూరు, సిర్పూర్ (టి), చింతలమానెపెల్లి, పెంచికల్‌పేట, దహెగాం, కాగజ్‌నగర్ మండలాలు ఉన్నాయి. వీటిలో మారూమూల గ్రామాలు 70, 80 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి.

ఆయా గ్రామాల్లో ఎక్కడైనా మంటలు అంటుకుంటే కాగజ్‌నగర్ నుంచి అక్కడికి చేరుకునే లోపే ఆస్తులు కాలిపోతున్నాయి. మరో వైపు ఆసిఫాబాద్ డివిజన్‌లోని కెరమెరి, వాంకిడి, జైనూరు, సిర్పూర్ (యు), లింగాపూర్, తిర్యాణి లాంటి మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో ప్రమాదాలు సంభవిస్తే ఆస్తులు అగ్గికి అహుతవుతున్నాయి. ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ మిల్లుల్లో ఏటా పెద్ద ఎత్తున అగ్నిప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఆసిఫాబాద్ మండలం కొత్త రహపల్లిలో రెండు సిలిండర్లు పేలిన సంఘటనలో మూడు ఇళ్లు కాలిపోయాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గడ్డివాములు, ఆసిఫాబాద్ క్రాస్ రోడ్డులోని జిన్నింగ్ మిల్లులో పత్తి అగ్నికి ఆహుతయ్యాయి.

కాగజ్‌నగర్‌లో పత్తి కొనుగోలు కేంద్రంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని ఆస్తి నష్టం జరిగింది. జైనూరు, కౌటాలలో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. జిల్లాలో 100 కిలోమీటర్ల మేర ఉన్న మారుమూల గ్రామాలు ఉండడం రోడ్లు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రమాద స్థలానికి సకాలంలో చేరుకోవాలంటే ఇబ్బందిగా మారుతోందని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. కాగజ్ నగర్ ఫైర్‌స్టేషన్‌లో మూడుఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సొంత భవనం లేక కార్యాలయం పాత పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు, తాగు నీరు, ప్రహరీ గోడ లేదు. జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాల్లో సౌకర్యాలు, తదితర విషయాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు.

అవగాహన కార్యక్రమాలు

ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, మార్కెట్లు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్ తదితర ప్రాంతాల్లో పోస్టర్లు, కరపత్రాలు, స్టిక్కర్లు అంటించి అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా రెండేళ్లలో మొత్తం 100 పైగా అగ్ని ప్రమాదాలు సంభవించాయి. కోట్ల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అధికా రులు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకోవడంతో ఏడు కోట్ల రూ పాయల మేర ఆస్తి నష్టం జరగకుండా మంటలను అదుపు చేశామని చెబుతున్నారు.

ఇలా చేయాలి..

- పిల్లలకు, అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు వంటి మండే వస్తువులు ఇవ్వకూడదు.
- కాల్చిన సిగరెట్లు, అగ్గిపుల్లలు ఆర్పకుండా బయట పడేయకూడదు.
- ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్తు పరికరాలు ఉపయోగించాలి, విద్యుత్ వైరింగ్ విషయంలో నాణ్యత ప్రమాణాలు తప్పసరిగా పాటించాలి
- గదుల్లో వెలుతురు, గాలి ఉండేలా చూసుకోవాలి
- పాడైన గ్యాస్ పైపులను వెంటనే మార్చుకోవాలి
- గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ బంద్ చేయాలి
- గడ్డివాములు, నివాస గృహాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి
- ఇంటి వంటగదిలో ముఖ్యంగా రిఫ్రిజిరేటర్ లేకుండా చూసుకోవాలి.
- సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంట వస్తే అది వ్యాపించకుండా వెంటనే భయాందోళన చెందకుండా ఒక బక్కెట్టును రెగ్యులేటర్‌పై బోర్లించాలి
- అనంతరం రెగ్యులేటర్‌ను ఆఫ్ చేసుకొని ప్రమాదాలను నివారించవచ్చు
- ఇంట్లోని వారు ఊరికి వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్ ఆఫ్ చేసి వెళ్లాలి
- గ్యాస్ లీకయిన సందర్భంలో విద్యుత్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయకూడదు

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు..

అగ్నిమాపక కేంద్రం	- ఫోన్ నంబరు
కాగజ్‌నగర్	- 8712699192
ఆసిఫాబాద్	- 8712699190

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



కాగజ్‌నగర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పెరుగు ఆత్మారాం, దేవేందర్, యలమంచలి శ్రీనివాస్, రాంచందర్, సంజీవ్, వాసు, మక్బూల్, శంకర్, వాసం శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ డిపో పరిధిలో రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీని రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంచందర్, రీజనల్ అధ్యక్షుడు హనుమంతరావు, సలహాదారులు సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నర్సింగ్ ఆధ్వర్యంలో ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా మల్లేశం, కార్యదర్శిగా దివాకర్, ఉపాధ్యక్షులుగా పాషా, ప్రభాకర్‌రావు, లింగయ్య, సహాయ కార్యదర్శిగా మహబూబ్, మోహన్, భూమన్న, ప్రచార కార్యదర్శిగా ఆరీఫ్ అలీలను ఎన్నుకున్నారు.

నేడు 'భూ భారతి'పై అవగాహన

కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం వంజీరి రైతు వేదికలో భూ భారతి చట్టంపై సోమవారం ఉదయం 9 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

దహెగాం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రానికి సమీపంలో ఆదివారం ఎస్సై రాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన ధ్రువపత్రాలు పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫాం ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపకూడదని సూచించారు.

వరంగల్ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం మహాసభకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. వరంగల్‌లో పార్టీ నిర్వహించే మహాసభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, తుకారాం, పవన్, గౌరయ్య, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న గోడను తొలగించిన అధికారులు



అధికారులు తొలగించిన గోడ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీచౌక్‌లో ఓ ఇంటి మూడో అంతస్తులోని గోడ ప్రమాదకరంగా మారడంతో అధికారులు ఆదివారం తొలగింపజేశారు. ఆరు రోజుల క్రితం వీచిన గాలికి గాంధీచౌక్ సమీపంలో ప్రకాష్‌కు చెందిన భవనం మూడంతల నిర్మాణంలో ఉన్న బాల్కానీ గోడ పెద్ద చప్పుడుతో కూలింది. ఈ సంఘటనలో అక్కడే ఉన్న బైక్, సైకిల్‌పై ఇటుకలు పడి దెబ్బతిన్నా యి. పెద్ద శబ్దం రావడంతో అక్కడున్న వారు భయాందోళనతో పరుగులు తీశారు. ఆ సమయంలో మనుషులు ఉండి మృతి చెందితే ఎవరు బాధ్యత వహిస్తారని సోషల్ మీడియాలో, పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. ఒక్క ఇటుకతో నిర్మాణం చేపట్టడం వల్లే నాణ్యతగా లేక కూలియిందని యూజమానికి నోటీసులు జారీ జారీ చేసి మూడో అంతస్తులో ఉన్న గోడను తొలగింపజేశారు.

బాబోయ్ ఎండలు

- 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతకు ప్రజలు విలవిల



ఎండకుచాట అడ్డు పెట్టుకున్న మహిళ



వారసంతలో గొడుగులు ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండుతున్నాయి. జిల్లాలోని రెబ్బెన, తిర్యాణి, కెరమెరి మండలాల్లో ఆదివారం అత్యధికంగా 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆసిఫాబాద్‌లో 41.5, సిర్పూర్(టి)లో 40.9, దహెగాంలో 40.5, వాంకిడిలో 40.4, కాగజ్‌నగర్‌లో 40.3, పెంచికలపేటలో 40.2, కౌటాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతకు ప్రజలు బయటకు రావడమే మానుకుంటున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్కెట్లు వెలవెలబోతున్నాయి. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చే వారు 12 గంటలలోపే ఇళ్లకు చేరుతున్నారు. ప్రస్తుతం శుభకార్యాలు ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. సాయంత్రం ఐదు వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఎండ వేడి, ఉక్కపోత ఉండడంతో జిల్లా వాసులు విలవిలలాడుతున్నారు. వేడిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ వేడిమి పెరిగింది. ఆదివారం వార సంత కావడంతో నిత్యావసర సరుకులు, కూరగాయాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఉదయం 11 గంటల వరకే ఎండ తీవ్రత అధికమవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. వ్యాపారులు గొడుగులు ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేపట్టారు. వాహనదారులు తలకు రుమాలు కట్టుకుని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు బయటకు వెళ్లిన సమయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

బెజ్జూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా క్షణికావేశంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మద్యం తాగి భర్త ప్రతి రోజు కుఉంబ సభ్యులతో గొడవ పెట్టుకుంటుండడంతో మనో వేదనకు గురైన మహిళ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకరి లక్ష్మి(53) పురుషోత్తం దంపతుల కూతురు సరితను మహారాష్ట్రలోని సిర్వోంచ గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. సరిత భర్త మృతి చెందడంతో కొద్ది రోజులుగా పుట్టింట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో తండ్రి పురుషోత్తం తరుచు మద్యం తాగి వచ్చి కూతురును తిట్టేవాడు. నువ్వు ఇక్కడ ఎందుకు ఉంటున్నావని, అత్తగారింటికి వెళ్లి పో అంటూ తరుచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కుటుంబంలో మళ్లీ కలహాలు రావడంతో తల్లి లక్ష్మి మనో వేదన చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. లక్ష్మి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు దంపతులు

బెజ్జూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రంగనాయక ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రంగనాయక, శివాలయ, హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగనాయకఆలయం అతి పురాతనమైన మహిమన్వితమైనదని అన్నారు. దక్షిణ భారతదేశంలో అతి పురాతనమైన ఆలయంగా రంగనాథునికి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం గతంలో అసెంబ్లీ వేదికగా ప్రస్తావించానని చెప్పారు. కామన్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు వెచ్చించి ఆలయాభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. గతంలో నాయకులు అరుణ, మనోహర్ గౌడ్ దపంతులు ఎమ్మెల్యేగా హరీష్‌బాబు విజయం సాధిస్తే పూజలు నిర్వహి స్తామని మొక్కుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే హరీష్‌బాబు దంపతులచే ఆల యా ల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, నాయకులు బాస్కర్ రాజు, బాలకృష్ణ, వసీఖాన్, రాకేష్, రాజారాం, తిరుపతి, శ్యాంసుందర్, రమేశ్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

జోరుగా ఉపాధి హామీ పనులు

- సౌకర్యాలు లేక కూలీల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని

మల్లయ్య, ఉపాధి హామీ ఏపీవో



జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజుల పాటు పని కల్పిస్తాం. ఏప్రిల్ 1 నుంచి ప్రతి రోజు రూ.307 కూలి అందజేస్తున్నాం. కూలీల పనికి తగిన వేతనం అందించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తాం. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా 441 పనులు చేపట్టేలా ప్రణాళిక తయారు చేశాం. దీని ప్రకారమే చేపడుతున్నారు.

కెరమెరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు పెద్దగా లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కూలీల సంఖ్య పెరుగుతోంది. కానీ పని ప్రదేశంలో చలవ పందిళ్ల, మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం ఎక్కడా కనిపించడం లేదు. ఈ ఏడాది అధికారులు ముందుగా గ్రామాల్లో పనులను గుర్తించి ప్రారంభించారు. ఏప్రిల్, మే నెలల్లో పనులు సాగేలా కార్యాచరణ రూపొందించారు.

441 పనులు గుర్తింపు

మండల వ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 441 పనులను అధికారులు గుర్తించారు. అందుకు గాను రూ.14.75 కోట్ల అంచనా వ్యయంగా ప్రతిపాదించారు. మండలంలో 6,852 జాబ్‌కార్డులు ఉన్నాయి. 11,630 మంది కూలీలు పని చేస్తున్నారు. వీరికి వందరోజుల పాటు పని కల్పించేలా అధికారులు పనులను గుర్తించారు. ఈ మేరకు ఊటకుంటలు, చిన్న ఊటకుంటలు, చేపల పెంపకం కుంట, పారంపాండ్ పనులు, నీటి నిలువ కాలవలు పనులు చేపట్టాలని గుర్తించారు. అంతర్గత రోడ్లు, గ్రామాల నుంచి అడవికి వెళ్లే రోడ్లు, రెండు గ్రామాల మధ్య అనుసంధాన రోడ్లు, పశువుల పాకలు, కోళ్ల ఫారాలు, కమ్యూనిటీ, వ్యక్తిగత ఇంకుడు గుంతలు చేపట్టాలని నిర్ణయించారు.